భోగభాగ్యాలిచ్చే భోగేశ్వరుడు

- 16,17న ఆలయంలో ప్రత్యేక పూజలు
- 17న శివపార్వతుల కల్యాణోత్సవం



భోగేశ్వరాలయం

పామిడి: మాఘమాస మహాశివరాత్రి వేడుకల్లో శివాలయాలకు ప్రత్యేకత ఉంది. అందులో భాగంగా పట్టణంలోని భోగేశ్వరాలయంలోని భోగేశ్వరుడు, నగరేశ్వరాలయంలోని నగరేశ్వరుడు తదితర ఆలయాల్లోని మూలవిరాట్ శివలింగాలు ప్రత్యేక పూజలకు నోచుకుంటున్నాయి. శివాలయాలు రోజూ భక్తుల శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. ప్రధానంగా భక్తులు భక్తిప్రపత్తులతో భోగభాగ్యాలు ఇచ్చే భోగేశ్వరుడిని దర్శించుకుని తరిస్తున్నారు.

మాఘమాసంలో పుణ్యస్నానాలు

భోగేశ్వరాలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇది పెన్నానది ఒడ్డున వెలిసిన పుణ్యక్షేత్రం. 50 సంవత్సరాల క్రితం మాఘమాసంలో ఈ పవిత్ర పెన్నానదిలో భక్తాదులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి నియమనిష్టలతో భోగేశ్వరుని పుణ్యక్షేత్రాన్ని దర్శించుకొని తరించేవారు. మంచుకొరికే చలిని సైతం భక్తులు లెక్కచేయక మరీ నదిలో పుణ్యసాన్నాలు ఆచరించి కఠోర దీక్షతో భోగేశ్వరాలయంలోని ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులకు పూజించి ఆధ్యాత్మిక ఆనందంలో తన్మయం పొందేవారు. కాలక్రమేణ ప్రస్తుతం పెన్నానది కలుషితం అవ్వడంతో నదీ పుణ్యస్నానాలు ఆగిపోయాయి.

భోగేశ్వరాలయ చరిత్ర..

16వ శతాబ్దంలోని చోళరాజుల కాలం నాటిది ఈ భోగేశ్వరాలయం. గోశాలలోని గోవులను రోజూ పసుల కాపరి పెన్నానదికి మేతకు తోలుకెళ్లేవాడు. ఆ మందలోని ఓ గోవు పూర్తిగా పాలు ఇవ్వకపోవడంతో కాపరికి సందేహం వచ్చింది. దీంతో కాపరి ఆ గోవుపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. ఆ గోవు ఓ పుట్ట వద్ద రోజూ పాలధార విడుస్తుండడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని రాజు దృష్టికి తెచ్చాడు. దీంతో రాజు తన సైనికులతో వచ్చి చూడగా ఆ గోవు పుట్ట వద్ద పాలధార వదులుతుండడాన్ని గమనించాడు. తక్షణం రాజు, సైనికులతో ఆ పుట్టను పెకలించాడు. ఆ పుట్టలో శివలింగానికి పాము ముడి వేసుకుని ఉండడాన్ని గమనించాడు. దీంతో రాజు ఇక్కడ శివాలయాన్ని నిర్మించాడు. పెన్నానది ఒడ్డున వెలసిన ప్రాచీన పుణ్యక్షేత్రమే ఈ భోగేశ్వరాలయం. మొదట శేషగ్రంథిపురం అను పేరుగల ఈ గ్రామం పాముముడి వాడుకలో పాముముడి పోయి కాలక్రమేణా పామిడిగా మారింది.



ఆలయ ఆవరణలో చోళుల కాలంనాటి శిలాఫలకం

ప్రత్యేక అభిషేకాలు, హోమాలు



భోగేశ్వరుడి మూలవిరాట్

పట్టణంలోని భోగేశ్వరాలయంలో ఈనెల 26న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం తెల్లవారుజామున 4 గంటల నుంచి గణపతి పూజ పుణ్యాహవాచనం, గోపూజ, ఏకదశవార రుద్రాభిషేకం అనంతరం స్వామివారి దర్శనం , తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు స్వామికి ప్రత్యేక అలంకరణ, సాయంత్రం 5 గంటలకు దివ్యదర్శనం తీర్థప్రసాద వినియోగం, రాత్రి 10 గంటలకు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక బంగారు రథముపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. అంతకంటే ముందు ఈనెల 16,17 తేదీల్లో భోగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు బహుళ చవితిని సందర్భంగా గణపతి దుర్గా సహిత రుద్రస్వాహాకార హోమాలు నిర్వహిస్తామన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు మేషలగ్నమందు శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



గుంతకల్లులో ప్రచారం ప్రారంభిస్తున్న సీఐలు మనోహర్, మస్తాన్



శింగనమలలో మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

గుంతకల్లుటౌన్/శింగనమల/గార్లదిన్నె: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, మస్తాన్ సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం గుంతకల్లు పట్టణంలో ఆటోలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఆకర్షణీయమైన ఆఫర్లు గుప్పించే యాప్‌లు, లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఆధార్ డేటా అప్‌డేటింగ్, ఓటీపీ, వ్యక్తిగత వివరాలను అపరిచిత వ్యక్తులకు షేర్ చేయరాదని వారు వివరించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొండయ్య, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- శింగనమల మండలంలోని పలు గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- గార్లదిన్నెలో సైబర్ నేరాలపై ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా అవగాహన కల్పించారు.

కంది కట్టె, వరిగడ్డి వాము దగ్ధం



తెలికిలో వరిగడ్డి వాము దగ్ధమవుతున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని తెలికి గ్రామంలో శనివారం బోయ నాగయ్యకు చెందిన కందికట్టె, సాంబశివుడు కి చెందిన వరిగడ్డి వాము అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు కల్లాల్లో నిండుగా ఉన్న కందికట్టెను పంట నూర్పిడికి కోసం వాము వేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బహిర్భూమికి వెళ్లి పొగ తాగే క్రమంలో నిప్పు పడి ఉండవచ్చని అనుమానంగా ఉందని , తమపై ఎవ్వరికీ ఎలాంటి కక్ష లు లేవని బాధిత రైతులు పేర్కొన్నారు. 10 క్వింటాళ్ల కంది, రూ.50 వేలు విలువ చేసే వరిగడ్డి కాలిపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గ్రాసం దగ్ధం

మండల కేంద్రమైన పెద్దవడుగూరులో గుడిపాటి సాంబశివారెడ్డి కి జొన్న పంట గ్రాసం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకొంది. వివరాలు.. ఉదయాన్నే పొలంలో జొన్నపంట గ్రాసాన్ని ట్రాక్టర్ వేసుకుని కల్లంలోకి తోలుకుంటుండగా దారిలో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ దారి పొడవుగా కాలుతున్న గ్రాసాన్ని వదలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ. 30 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు తీగలు సవరించాలని గ్రామస్తులు కోరారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



గుత్తి ప్రభుత్వాస్పత్రిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



తాడిపత్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న సీఐ సాయిప్రసాద్



గుంతకల్లులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య

గుత్తి/తాడిపత్రి టౌన్/గుంతకల్లుటౌన్/శింగనమల/యాడికి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. గుత్తి కోటలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, గుత్తి కోట పర్యాటక గైడ్ రమేష్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, కోటలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబహాన్, ప్రభుత్వాస్పత్రిలో సూపరిండెంటెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు.

- తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారం శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు,విద్యార్థులు తరగతి గదులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, స్వచ్ఛాంధ్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ అల్తాఫ్, వైస్ ప్రిన్సిపల్ ఓబులేసు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జమీలాబీబీ, అకాడమీ కోఆర్డినేటర్ శివశంకర్ శర్మ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.
- శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహరాజు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మమ్మ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ వీర్రాజు, ఈఓపీఆర్డీ శశికళ, ఏఓ నాగేశ్వర రెడ్డి, ఐసీడీఎస్ విజయకుమారి, ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ నరసింహరాజు



యాడికిలో ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ వీర్రాజు, అధికారులు

ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో కిమ్స్ సవీరా హాస్పిటల్ సౌజన్యంతో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె పరీక్ష శిబిరం ఏర్పాటు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. ఈ మెడికల్ క్యాంప్‌లో రక్త పరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. కిమ్స్ సవీరా వైద్య సిబ్బందికి కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



కళాశాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవం



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామంలో కొండల్లో వెలసిన భక్తుల కొంగు బంగారమైన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామా ర్చన వంటి కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు రామాచార్యులు చేశారు. స్వామి వారికి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెండి విగ్రహాలను రంగు రంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన రథంలో ఉంచి, పుర వీధుల్లో రాత్రి స్వామి రథోత్సవం ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులు భజన కీర్తనలతో మేళతాళాలతో స్వామివారిని ఊరేగిస్తూ రథాన్ని స్వామి వారి సన్నిధికి చేర్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లా నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే కొండల్లో ఉన్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

అశ్వత్థం బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి 47 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శంకర్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు రానుండటంతో తాడిపత్రి బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి బస్సు నడుపుతున్నామన్నారు. భక్తులు బస్సులను సద్వినియోగం చేసకోవాలన్నారు.

ఆర్‌ఆర్‌బీ ఉచిత కోచింగ్

గుంతకల్లుటౌన్: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. శనివారం కళాశాల డిజిటల్ క్లాస్‌రూమ్‌లో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు డాక్టర్ గోపీనాయక్, రవిశంకర్ శర్మ, దేవిచైతన్య, వాణిశ్రీ, శివకుమార్, జమీలాబీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

తాడిపత్రి రూరల్: స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో శనివారం అర్జాస్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు భవిష్యత్ కౌన్సెలింగ్ సంస్థ కెరీర్ గైడెన్స్‌పై కార్యక్రమం నిర్వహించింది. గోల్ సెట్టింగ్, రేస్ ప్రిపరేషన్, మనీ మెనేజ్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాలిటెక్నికల్ తరువాత ఉన్నత విద్య, ఉన్నత ఉద్యోగాలకు కెరీర్ గైడెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అర్జాస్ ఉద్యోగులు నరేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం



గుత్తి: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న లక్ష్మమ్మ గుడి సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బెంగుళూరుకు చెందిన ఓ కుటుంబం కారులో మంత్రాలయం వెళ్తుండగా మార్గమధ్యలో కారు టైర్ బరస్ట్ అయింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాళ్లను ఢీ కొంది. ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జాతీయస్థాయి సదస్సులో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: నంద్యాలలోని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ప్రవాహ 2కే25, సంకల్ప్ 2కే25 అనే జాతీయ సాంకేతిక సదస్సు నిర్వహించారు. దేశంలో 30 కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. గేట్స్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకుని బహుమతులు అందుకున్నారు. ఈ క్రమంలో శనివారం గేట్స్ కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్: విజయవాడలో ఈ నెల 23న నిర్వహించే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలీనసభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, సత్తార్, రామాంజినేయులు, షేక్షా, బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


రాజీ మార్గమే రాజమార్గం



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి కృష్ణవేణి

తాడిపత్రి రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని, కేసుల సత్వర పరిష్కారంలో న్యాయవాదులు చొరవ చూపాలని తాడిపత్రి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణవేణి సూచించారు. స్థానిక కోర్టులో శనివారం న్యాయవాదులతో మెజిస్ట్రేట్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావడానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. చెక్ బౌన్స్, ప్రామీసరీ నోట్‌లకు సంబంధించిన కేసులపై న్యాయవాదులు దృష్టి పెట్టాలన్నారు. రాజీ మార్గాల ద్వారా కక్షిదారులకు ఉపశమనం కలిగించడానికి లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, న్యాయవాదులు చక్రపాణి, కుమారస్వామి, శివయ్య, అనీఫ్, శ్రీనివాసులు, సాహుల్, శ్రీధర్, మధువీణ, ఫరీద, రెష్మా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



నెట్టికంటి ఆంజనేయ స్వామి

యాడికి: మండలంలోని పచ్చారుమేకలపల్లి సమీపంలో ఉన్న చిన్నపేట పొలంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శనివారం తెల్లవారుజామున నెట్టికంటి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టతో పాటు ధ్వజ స్తంభ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను గ్రామస్తుల విరాళాలతో దాదాపు రూ.25 లక్షలు ఖర్చు చేశారు. గ్రామానికి చెందిన గొర్తి వెంకటరాముడు కుమారులు ప్రతాప్, లోకేష్ తమ పొలంలో దాదాపు రూ.20 లక్షల సొంత నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో రాతి కట్టడంతో దేవాలయం నిర్మించారు. మండల కేంద్రంతోపాటు చందన, రాయలచెరువు, లక్షుంపల్లి, కేశవరాయుని పేట, పేద్దపేట గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి టెంకాయలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

వైవీఆర్‌ను కలసిన ఆలూరు ఎమ్మెల్యే



వైవీఆర్‌తో మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

గుంతకల్లుటౌన్: హైదరాబాద్ సర్వైకల్ సర్జరీ చేయించుకుని నాలుగు నెలల తరువాత గుంతకల్లులోని తన నివాసానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని శనివారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీఆర్‌కు పుష్పగుచ్ఛం, పండ్లు అందజేసి శాలువాతో సత్కరించారు. వైవీఆర్ ఆరోగ్య యోగక్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ కార్యక్రమాలు తదితర విషయాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, నాయకులు శేఖర్, రాఘవేంద్ర, భీమలింగప్ప పాల్గొన్నారు.

ర్యాలీ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

పామిడి: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆ పార్టీ సీనియర్ నాయకులు కే రహీమ్, పీ అనిమిరెడ్డి అధ్యక్షతన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 17న నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు.వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పేదలు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల దస్తగిరి, మల్లేసు, ముత్యాలు, ఓబయ్య, ఇమాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.